క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు సింహాద్రి పరామర్శ

కోడూరు: మండలంలో ఇటీవల మృతి చెందిన ఇద్దరి కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. కోడూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికులు వేముల గురుప్రసాద్ ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన అద్దంకి ప్రభుదాస్ పులిగడ్డ వద్ద గుండెపోటుతో మృతిచెందాడు. రమేష్‌బాబు మృతుల నివాస గృహాలకు వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. చిన్న వయస్సులో గుండెపోటుతో మరణించడం బాధాకరమని సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, బీసీ సెల్ మండల కన్వీనర్ చేబోయిన కృష్ణారావు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత జాతర మహోత్సవం



లక్ష్మీపురం(కృత్తివెన్ను): మూడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న గ్రామదేవత సంబరం వారిలో ఐక్యతతో పాటు అంతులేని అనుబంధాన్ని నింపుతుంది. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కనకపెన్నమ్మ జాతర మహోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుంది. ఆదివారం, సోమవారం జాతర విశేషంగా సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇతర గ్రామాలతో పాటు విదేశాల్లో సైతం స్థిరపడ్డ స్థానికులంతా ఒక్క చోట చేరడంతో గ్రామంలో ఎక్కడలేని సందడి నెలకొంది. ఆదివారం మాజీ డెప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్‌తో పాటు పలువురు ప్రముఖులు, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారి జాతరలో పాల్గొని దర్శించుకున్నారు. సోమవారం కూడా జాతర జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

కేంద్రంలో రైతు, కార్మిక వ్యతిరేక పాలన



బంటుమిల్లి: కేంద్రంలో రైతు, కార్మిక, కర్షక వ్యతిరేక పాలన జరుగుతోందని సీపీఎం నాయకులు విమర్శించారు. ఆదివారం కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త కార్మిక, కర్షక, మైత్రి దినోత్సవం సందర్భంగా స్థానిక లక్ష్మీపురం సెంటర్లో సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న సీపీఎం, రైతు సంఘం, సీఐటీయు నాయకులు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. జనార్దన్‌రావు, జి. నాగేశ్వరరావు, ఎల్. అజయ్ ఘోష్, ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బంటుమిల్లి: మచిలీపట్నం ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీల్లో స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభతో జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచారు. ఆదివారం మచిలీపట్నం ఎస్ఎస్ఆర్ డీగ్రీ కళాశాలలో అకాడమీ వారు జాతీయ సమైక్యత అనే అంశంపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కొమ్మారెడ్డి పాఠశాలకు చెందిన నంబూరి గీతికాప్రియ ప్రథమ బహుమతి, అజ్మీరాఘురామహర్షి తృతీయ బహుమతులు అందుకున్నారు. అలాగే తోట నాగ సాయిసుమంత్, ప్రత్తి మహీధర్‌లకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డీవైఈఓ బీఎస్సీ శేఖర్‌సింగ్, అకాడమీ ఉపాధ్యక్షుడు ప్రసాదు, సెక్రటరీ బి. రమేష్, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, కళాశాల ప్రిన్స్‌పాల్ జేవీఆర్‌లు విజేతలకు బహుమతులు అందచేసి అభినందించారు. విజేతలను పాఠశాల డైరెక్టరు కె.కిషోర్, హెచ్ఎం ఎస్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలు శివారు ప్రశాంత్ నగర్ నివాసి కాకి నాగమణి వైద్య ఖర్చుల నిమిత్తం పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు రూ. 5 వేలు ఆర్థిక సాయం అందచేశారు. సుగర్ వ్యాధితో రెండు కాళ్లు చచ్చుబడి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో కొంతకాలంగా చికిత్స పొందుతున్న ఆమెకు మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రిలో చేరేందుకు దారి ఖర్చులు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న దాత శ్రీనివాసరావు మానవతా దృక్పథతో దారి ఖర్చుల నిమిత్తం ఈ ఆర్థిక సాయం కుంటుంబ సభ్యులకు ఆదివారం అందచేశారు. రుయా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించేలా కృషిచేస్తానని భరోసా కల్పించండంపై బంధు మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

గంజాయి మత్తులో యువత

- నాగాయలంకలో ఆందోళన కలిగిస్తున్న గంజాయి వాడకం
- గంజాయి వ్యసనంతో ముగ్గురు మృత్యువాత?
- కృష్ణాతీరం కరకట్ట అడ్డాగా చెలరేగుతున్న యువకులు



గంజాయి మొక్క



గంజాయి తాగేందుకు సిద్ధం చేస్తున్న దృశ్యం

నాగాయలంక: మండల కేంద్రంలో గంజాయి, మద్యం వ్యసనాలకు బానిసలుగా మారి పలువురు యువకులు ప్రాణల మీదికి తెచ్చుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. గ్రామం నడిబొడ్డున మూడేళ్ల క్రితం తోపుడు బండి వ్యాపారం చేస్తున్న వితంతు మహిళ గంజాయి విక్రయాలు సాగిస్తూ తాను అద్దెకు ఉంటున్న గృహంలో రెడ్ హ్యాండెడ్‌గా గంజాయితో పోలీసులకు పట్టుబడింది. గత ఆరేడు నెలలుగా నాగాయలంకలో గంజాయి బారిన పడుతున్న యువకుల సంఖ్య రోజు రోజుకు అధికం కావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామంలోని పశ్చిమ భాగంలోని కరకట్ట, కృష్ణానది తీర ప్రదేశాలు అడ్డాగా గంజాయి వ్యసనపరులు హల్‌చల్ ఎక్కువగా కనిపిస్తుందని స్థానికులు అంటున్నారు. కరకట్ట దక్షిణం వైపు బాడితలంకగా పిలిచే ప్రాంతం నుంచి కరకట్ట ఉత్తరం దిశగా గ్రామ శివారు వరకు ప్రతి నిత్యం గంజాయికి, అధిక మద్యానికి వ్యసనపరులైన యువత సంచారం ఉంటుంది. చాలా మంది పోలీసులకు సైతం ఈ వ్యవహారాలు తెలియనివి కాదనే విమర్శలూ వినిపిస్తున్నాయి. నాగాయలంక, సమీప కాలనీలకు చెందిన నలుగురు యువకులు గంజాయి వ్యవసనంతో స్వల్పకాలంలో చిన్న వయస్సులో మృత్యవాత పడ్డారని గ్రామస్తులు నిత్యం ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యసనాలకు అలవాటు పడి అవసరమైన డబ్బులు అందకపోతే చేతులు బ్లేడుతో కోసుకుని తల్లిదండ్రులను బెదిరించి డబ్బు తీసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఈ నెల మొదటి వారంలో తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో శ్మశానంలో గంజాయి పెంచుకుంటూ పట్టుబడిన వెల్డర్ బాబ్జీ అనే యువకుడిది కృష్ణాజిల్లా నాగాయలంక ప్రాంతమని అక్కడి పోలీసులు ప్రకటించడం తెలిసిన విషయమే. మత్తు వ్యసనాలకు లోనైన యువకులు ఇద్దరు ముగ్గరు కలసి తరచూ గ్రామ వీధుల్లో, మెయిన్ సెంటర్లలో బైక్‌లపై ర్యాష్‌గా నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ పాదచారులకు గండె దడ కలిగించడం గమనార్హం. రోజురోజుకు ఈ పాంతంలో గంజాయి బారిన పడుతున్న యువకుల సంఖ్యతో తల్లదండ్రుల్లో కలవరం చెలరేగుతుంది. ఇక్కడ గంజాయి మూలాలను ఛేదించి దరలవాట్ల బారిన పడుతున్న యువకులను నిరోధించకుంటే రానున్న రోజుల్లో విపరీత పరిణామాలు పెచ్చరిల్లే అవకాశాలు తప్పవని ఆందోళన కనిపిస్తుంది.



కఠిన చర్యలు తప్పవు

గంజాయి వ్యవహారాలు మా దృష్టికి రాలేదు. పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు. యువత తప్పుడు దారి పట్టకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. గంజాయి ఇతర మత్తు వ్యసనాలకు అలవాటు పడి దురుసుగా నడుచుకునే యువకుల సమాచారం పోలీసుల దృష్టికి తెచ్చి సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ గుర్తెరగాలి.

–కలిదిండి రాజేష్, ఎస్ఐ, నాగాయలంక



భవిష్యత్‌ను కాలరాసుకోవద్దు

విచక్షణ కోల్పోయేలా యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్యంతో పాటు సువర్ణ భవిష్యత్‌ను కాలరాసుకుంటున్నారు. పాఠశాలల స్థాయి నుంచే బాలలకు, గ్రామాల్లో యువకులకు గంజాయి, మద్యం బారిన పడితే కలిగే వచ్చే ప్రమాదాలపై అవగాహన కలిగించాలి. జిల్లాలో రిహాబిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, మత్తకు బానిసలైన వారిని గుర్తించి ఆ సెంటర్లలో చికిత్స అందించాల్సి ఉంది.

–తలశిల రఘుశేఖర్, అధ్యక్షుడు, సుదర్శి మానవతా సంస్థ, నాగాయలంక



తల్లిదండ్రుల ఆవేదన భరించరానిది

గంజాయి వ్యవసనాలకు బానిసలై పలువురు యువకులు మృత్యువాత పడుతుంటే వారి తల్లిదండ్రుల ఆవేదన జీవితాంతం భరించరానిది. సంబంధిత అధికార వ్యవస్థలు, పోలీసులు అప్రమత్తమై ముందుగానే కఠిన చర్యలు చేపట్టాలి. గ్రామాల్లో గంజాయికి బానిసలు అవుతున్నారనే విషయం అందరికీ తెలిసిందే. కాకపోతే భయపడి ఎవరికి వారు తప్పించుకుంటూ పోతే భవిష్యత్‌లో సామాజిక ముప్పు తప్పదు.

–వాడపల్లి నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నేత, నాగాయలంక

భక్తిశ్రద్ధలతో వనవలమ్మదేవి జాతర

ఆలయానికి పోటెత్తిన భక్తులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నిజాంపేటలో వేంచేసి ఉన్న నూతి వీరయ్యగారి ఆది వనవలమ్మ దేవి 108వ వార్షిక గ్రామోత్సవ సంబరం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి వేలాదిగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని తిలకించేందుకు భక్తులు బారులు తీరారు. నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నూతి వనవెంకట సత్యనారాయణ (రమణ) దంపతులు ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి విగ్రహం వద్ద నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అమ్మవారికి పెద్ద ఎత్తున కానుకలు సమర్పించారు. ఆలయ ప్రాంతంలో ఆట బొమ్మల దుకాణాలు, పిల్లల ఆటల వస్తువులు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపు కనులపండువగా సాగింది. ఊరేగింపు రథం ముందు ఏర్పాటు చేసిన బేతాళ నృత్యాలు, తీన్‌మార్, డప్పులు, బాణసంచా మోతలు భక్తులను ఆకట్టుకున్నాయి. సోమవారం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త రమణ తెలిపారు. ఈ జాతర మహోత్సవాన్ని ధర్మకర్త రమణ, వన సాయిప్రసాద్, వన శ్రీనివాసరావు, వన రాములు, భక్త బృందం సభ్యులు పర్య



ఆలయం వద్దకు చేరిన అమ్మవారి ఊరేగింపు రథం



ఆలయం వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న ధర్మకర్త రమణ దంపతులు



అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు

అడ్డదిడ్డంగా పార్కింగ్‌తో అవస్థలు



అడ్డదిడ్డమైన పార్కింగ్‌తో పెడన పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్ర రూపం దాల్చింది. నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధాన రహదారిలోనే కాకుండా ఇతర రోడ్లలో కూడా ట్రాఫిక్ జఠిలంగా మారింది. పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించినా, దుకాణాదారులకు హెచ్చరికలు జారీ చేసినా పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. ఆటోలు, ద్విచక్రవాహనాలు దుకాణాల బయట వదిలి మార్కెటింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చాయంటే ట్రాఫిక్ వలయంలో ఇరుక్కుపోయినట్లే.

–పెడన



కొలుకుల వారి వీధిలో అంతర్గత రోడ్డులో ద్విచక్ర వాహనాల పార్కింగ్



అంతర్గత వీధిలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య

అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి



గుడివాడ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో నాయకులు ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ రాజ్యాంగాన్ని కించపరుస్తూ పార్లమెంట్‌లో హోం మంత్రి వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఏ రాజ్యాంగం ద్వారా అమిత్ షా హోం మంత్రి అయ్యారో మర్చిపోవడం సరి కాదన్నారు. తక్షణమే హోం మంత్రి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, సీహెచ్ సత్యనారాయణ, కె. సురేష్, ఎల్. సురేంద్ర, ఆర్.కొండ, కె.లక్ష్మణరావు, అరుణ, యెషయ్య, నారాయణ, వెంకటేశ్వరరావు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న జడ్జిలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని కైకలూరు సీనియర్ సివిల్ డివిజన్ జడ్జి వి.వీర నాగవెంకట లక్ష్మి, మచిలీపట్నం స్పెషల్ మొబైల్ జడ్జి ఎం.వెంకటవాహిని ఆదివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సన్మానించారు. అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆయన పేరిట అమ్మవారికి వేద పండితుడు రుద్రపాక శరశ్చంద్ర సంతోష్ ప్రత్యేక పూజలను చేశారు.



జడ్జి వెంకట వాహినికి చిత్రపటాన్ని అందజేస్తున్న పండితుడు శరశ్చంద్ర



జడ్జి వెంకటలక్ష్మికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న పండితుడు శరశ్చంద్ర

చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ అండ



కమిషనర్ బాపిరాజుతో చర్చిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ సుబ్బన్న, నాగేశ్వరరావు తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన రహదారి మార్జిన్‌లో ఎన్నో ఏళ్లుగా కూరగాయలు, ఆకుకూరలు విక్రయించే చిరు వ్యాపారులకు వైఎస్సార్ సీపీ మరో సారి అండగా నిలిచింది. అనాదిగా రోడ్డు మార్జిన్‌లో వ్యాపారులు విక్రయాలు జరుపుతుండగా కూటమి పాలకులు, అధికారులు ఈ దుకాణాలను కూరగాయల మార్కెట్‌లో లోపలి వైపు ఉన్న ఖాళీ స్థలంలోకి మార్చేప్రయత్నం చేస్తున్నారు. శనివారం ఉదయం ఈ దుకాణాలను తొలగించే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లు, నాయకులు ఆదివారం ఉదయం ఈ ప్రాంతానికి చేరుకుని వ్యాపారులతో చర్చించారు. అనంతరం కూరగాయల మార్కెట్ వద్దకు వచ్చిన కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజుతో చర్చించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు మార్జిన్‌లో వ్యాపారులు ప్రతి రోజూ తెల్లవారు జాము నుంచి తొమ్మిది గంటల వరకూ మాత్రమే దుకాణాలు కొనసాగిస్తున్నారని ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించారు. దుకాణాలను తొలగించకుండా పాత పద్ధతినే కొనసాగించాలని కమిషనర్‌ను కోరారు. రోడ్డు వెంబడి ఉన్న కూరగాయలు, ఆకు కూరలు విక్రయిస్తున్న వ్యాపారులతో కమిషనర్, వైఎస్సార్ సీపీ నాయకులు కలసి వెళ్లి చర్చించారు. తాము ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా దుకాణాలను వెనక్కి పెట్టుకుంటామని, ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి మార్చవద్దని వ్యాపారులు కోరారు. తామందరం పండించిన కూరలనే ఇక్కడ విక్రయిస్తున్నామన్నారు. ఆ ప్రాంతంలో నాటు కోళ్లను విక్రయిస్తున్న వ్యాపారి సుంకర యేసు కమిషనర్ వద్దకు వచ్చి మున్సిపల్ ఉద్యోగి మల్లేశ్వరరావు, మరో ఇద్దరు అనధికార వ్యక్తులు తమకు రశీదులు ఇవ్వకుండా ఆశీలంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఒక్కో కోడికి రూ.20, రూ.30 చొప్పున వారి ఇష్టాను సారంగా సొమ్ములు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ అనధికార ఆశీల వసూళ్లను నిలిపియేయాలని కోరారు. రశీదులు ఇవ్వకుండా అనధికార ఆశీలు వసూలు చేయటం దారుణమని వివరించారు. కమిషనర్‌తో చర్చించిన వారిలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లు మేకల సుబ్బన్న, కాగిత జవహర్‌లాల్, మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, పర్ణం సతీష్, జోగి చిరంజీవి, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు, వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌ఛార్జ్‌లు గాజుల భగవాన్, షేక్ మహ్మద్ సాహెబ్, మన్నే శేషారావు, బూరగ రామారావు, చిత్తజల్లు రాజు, పడమట రమేష్ తదితరులు ఉన్నారు.

ఒత్తిడిని జయించడానికి యోగా అవసరం

చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక



ఆటల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ విజయ రాధిక

లంకపల్లి(ఘంటసాల): ఒత్తిడిని జయించడానికి యోగా ఎంతో అవసరమని చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక అన్నారు. ఘంటసాల మండలం లంకపల్లి గ్రామంలోని సత్యసాయి ధ్యాన మండలిలో శ్రీ యోగ శ్రీనివాస గురుజీ ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రారంభమైన బాలల వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీపీ విజయ రాధిక మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ యాంత్రికంగా పనిచేయాల్సి వస్తుందని... ఒత్తిడిని జయించడానికి యోగా ఎంతో అవసరమన్నారు. మానసిక ఒత్తిడి కారణంగా మానవులు అనారోగ్యం పాలవుతున్నాడని యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని జయించి మానసిక, శారీరక ప్రశాంతత పొందవచ్చునని సూచించారు. శిక్షణ తరగతుల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన బాల బాలికలకు ఎంపీపీ విజయ రాధిక చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. నేపథ్య గాయకుడు పెనుమాక వెంకటకృష్ణ, వారి శిష్య బృందం ఉమ, సాయి వెంకట జయశ్రీ, మణిదీప్ సాయి, రామ్ చైతన్యలు ఆలపించిన గీతాలు అలరించాయి. కూచిపూడికి చెందిన పత్రీజీ ధ్యాన శిక్షణ కేంద్రం నిర్వాహకులు బొంగర వెంకట నాంచారయ్య ధ్యానం చేయు విధానంపై వివరించారు. అనంతరం అతిథులను శ్రీయోగ శ్రీనివాస్ గురుజీ శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగ సాధకులు బోలెం రామారావు, సద్గుణరావు గురుజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఘంటసాల మండలం లంకపల్లిలోని శ్రీ సత్యసేవ ధ్యాన మండలిలో ఈ నెల 26 నుంచి ధ్యాన యోగ ఆధ్యాత్మిక శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని ధ్యానమండలి నిర్వాహకులు యోగ శ్రీనివాస్ గురుజీ తెలిపారు. 15 రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణ తరగతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

85 మందికి నేత్ర వైద్య పరీక్షలు



వృద్ధులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ నీతా, సంస్థ ప్రతినిధులు

నాగాయలంక: అంధత్వ నివారణే లక్ష్యంగా సుదర్శి మానవతా సేవా సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు అభినందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో ఈ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 48వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజాసంఘాల నాయకుడు తలశిల లీలామనోహర్ ప్రారంభించారు. క్రీ.శే తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడు /జ్ఞాపకార్థం వారి కుటుంబీకుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో జరిపిన శిబిరంలో 85 మందికి డాక్టర్ నీతా పరీక్షలు చేయగా వీరిలో 63 వృద్ధులును ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేసి ఉచిత శస్త్ర చికిత్సలకై బస్సులో శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి గంగాధర్ పాల్గొన్నారు. మత్తి శివ, తలశిల రవి తదితరులు సేవలందించారు.

నేటి నుంచి కలపటంలో గ్రౌండ్ ట్రూతింగ్

గూడూరు: ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని కలపటం గ్రామంలో సోమవారం నుంచి గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని గూడూరు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. దీనిలో భాగంగా ఓఆర్ఐ మ్యాపుల ద్వారా రైతుల వారీగా పొలాల సరిహద్దులను మార్కింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో వ్యవసాయ భూములు కలిగి ఉన్న రైతులు సర్వే సిబ్బందికి వివరాలు సమర్పించడానికి అందుబాటులో ఉండాలని ఆమె కోరారు.